www.freegurukul.org
(Values, Skill Based Education In Digital)
Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators.
We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org





గురువు లేని విద్య ప్రాణం లేని శరీరం లాంటిదని పెద్దలు చెప్తుంటారు. విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దే వారధిగా గురువుని వర్ణిస్తారు. అయితే సక్సెస్ కోసం తపనపడే వ్యక్తులకు మాత్రం లైఫ్ కోచ్‌లే గురువులు. విలువైన సలహాలు, సూచనలు ఇవ్వడమే వాళ్ల పని. ఆ పనినే ఒక ప్రొఫెషన్‌గా చేసుకుని.. ఎదుటివాళ్ల సక్సెస్‌లో భాగస్వాములుగా మారుతున్నారు లైఫ్ కోచ్‌లు...

# కొత్త గురువు.. లైఫ్ కోచ్

లైఫ్ కోచ్‌లు.. సింపుల్‌గా చెప్పాలంటే సక్సెస్‌కు గైడ్‌లు. ఒక రంగంలో విజయానికి అవసరమైన సూత్రాల్ని, సిద్ధాంతాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తారు. వాటిని వ్యక్తిగతంగా/వృత్తులకు ఎలా అన్వయించాలో తెలుసుకుంటారు. సమస్యలతో తమ దగ్గరకు వచ్చిన వాళ్లకు(క్లయింట్లు) సలహాలు ఇస్తారు. తద్వారా వాళ్ల సక్సెస్‌కి దారి చూపిస్తారు. ఈ మధ్య కాలంలో లైఫ్ కోచింగ్ రంగంపై జనాలకు ఆసక్తి పెరుగుతోంది. దాంతో లైఫ్ కోచ్‌లు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వయం ఉపాధితో తామే బాస్‌లుగా మారిపోతున్నారు. ఇంకోవైపు సమస్యలను నుంచి బయటపడేందుకు, కెరీర్‌లో ఫాస్ట్‌గా ఎదగడం కోసం లైఫ్ కోచ్‌లను ఆశ్రయించేవాళ్లూ రోజురోజుకీ పెరిగిపోతున్నారు.

## సక్సెస్.. నెక్స్ట్ లెవెల్

లైఫ్ కోచింగ్ అనేది ఒక కమర్షియల్ ప్రొఫెషన్. కెరీర్‌లో ఎదుగుదల కోసం ప్రయత్నించేవాళ్లు ఎక్కువగా లైఫ్ కోచ్‌ల్ని ఆశ్రయిస్తుంటారు. వ్యాపారం, ఎంట్రప్రెన్యూర్‌షిప్, ఆధ్యాత్మికం, ఆరోగ్యం, పెళ్లి, సెల్ఫ్ డెవలప్‌మెంట్.. తదితర విషయాల్లో సమస్యలు ఉన్నవాళ్లు లైఫ్‌కోచ్‌ల్ని సంప్రదిస్తుంటారు. ఒక్కోసారి 'సోల్‌మేట్' అన్వేషణ'లో కూడా వీళ్ల అవసరం పడొచ్చు. కన్సల్టింగ్, మానిటరింగ్, సలహాలు, థెరపీ, కౌన్సెలింగ్.. ఇలా లైఫ్ కోచింగ్ ఏ రూపంలో అయినా ఉండొచ్చు. కేవలం సలహాలతోనే సరిపెట్టకుండా క్లయింట్‌లోని ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తారు. అందుకే లైఫ్ కోచ్‌లను 'లైఫ్ కౌన్సెలర్లు' అని కూడా పిలుస్తారు. ఉదాహరణకు.. ఒక వ్యక్తి నచ్చని జాబ్ చేస్తూ మానసికంగా కుంగిపోతాడు. ఆ ఉద్యోగం వదిలేసి సొంతంగా వ్యాపారం చేయాలనుకుంటాడు. లేదా మరో ఉద్యోగం చేయాలనుకుంటాడు. కానీ, పరిస్థితులు అతనికి అనుకూలించవు. అలాంటప్పుడు ఆ వ్యక్తికి కౌన్సెలింగ్ నిర్వహించి.. ప్రతికూల ప్రవర్తనను దూరం చేస్తారు. అతనిలో శక్తిసామర్థ్యాలు, ఆర్థిక స్థితిగతుల్ని లైఫ్ కోచ్‌లు అంచనా వేస్తారు. ఏ వ్యాపారం ఉద్యోగం అతనికి సూట్ అవుతుందో చెప్తారు. అంతేకాదు ఆ వ్యాపారంలో ఎదుగుదల కోసం సూచనలు ఇస్తారు. వ్యాపారాన్ని మాత్రమే కాదు జీవితాన్ని, కెరీర్‌ను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లే బ్రిడ్జ్‌లు వీళ్లు.

## ఆల్ ఈజ్ వెల్

లైఫ్ కోచ్‌లకు ఓపిక ఉండాల్సిన అవసరం లేదు. ఎందుకంటే... కేవలం క్లయింట్లతోనే వీళ్లకి పని. సాధారణంగా వీళ్లు క్లయింట్ల సక్సెస్‌కి ఆటంకంగా ఉన్న కారణం గురించి పట్టించుకోకపోయినా వాళ్లను ఎలా ముందుకు తీసుకెళ్లాలి.. వాళ్ల ఎదుగుదలకి ఎలా సాయపడాలి? సమస్యను ఎలా పరిష్కరించాలి? అనే విషయాలపై దృష్టిసారిస్తారు. గొప్ప లైఫ్ కోచ్‌కు ఉండాల్సిన లక్షణాలపై నిపుణులు కొన్ని రూల్స్ రూపొందించారు కూడా.

- క్లయింట్లలో స్ఫూర్తిని నింపేలా లైఫ్ కోచ్‌లు పాజిటివ్ యాటిట్యూడ్‌తో ఉండాలి.
- కమర్షియల్, ప్రొఫెషనల్ అనే విషయం పక్కనపెట్టి.. సాయం చేసే గుణం అలవర్చుకోవాలి.
- ప్రతీ ఒక్కరూ అవతలి వాళ్ల తప్పుల్ని ఎత్తి చూపిస్తుంటారు. అయితే లైఫ్ కోచ్‌లు తమ దగ్గరికొచ్చే క్లయింట్ల విషయంలో ఆచితూచి వ్యవహరించాలి.
- లైఫ్ కోచ్‌లు చేయాల్సిన ముఖ్యమైన పని.. క్లయింట్‌లు చెప్పే ప్రతీ విషయాన్ని శ్రద్ధగా వినడం. తద్వారా వాళ్ల సమస్యల్ని అర్థం చేసుకుని.. సరైన పరిష్కారం చూపించాలి.
- క్లయింట్ల భయాల్ని, వాళ్లలో ఉన్న మైనస్‌లను గమనించాలి. సమస్యని చాలెంజ్‌గా స్వీకరించి లోతుగా అధ్యయనం చేయాలి. నిజాయితీ, స్పష్టతతో ఆ సమస్యని ఎలా అధిగమించాలనేది క్లయింట్లకు చెప్పాలి.
- లైఫ్ కోచ్‌లు తమ పనిని సులువుగా చేయాలంటే. సమస్యతో పాటు క్లయింట్ల ఫీలింగ్స్‌ను అర్థం చేసుకోవాలి. రకరకాల ప్రశ్నలతో క్యూరియాసిటీని పెంచాలి. అంతేకాదు అది వాళ్ల సక్సెస్‌లో ఎలా భాగం అవుతుందో వివరించాలి.




- లైఫ్ కోచ్‌లు పాటించాల్సిన మరో బేసిక్ విషయం.. క్లయింట్లతో స్పష్టంగా వ్యవహరించాలి. భాష, ఉపయోగించే పదజాలం, బాడీ లాంగ్వేజ్‌లకు.. కనెక్టివిటీ ఉండాలి. ఎక్కడా తడబడకుండా చూసుకోవాలి.
- కేవలం సలహాలు ఇవ్వడం మాత్రమే లైఫ్ కోచ్‌ల పని కాదు. సమస్యకు సరైన పరిష్కారం కనిపెట్టాలి. క్లయింట్లకు ఏం చేయాలనే విషయాన్ని చెప్పాలి. క్లయింట్ల నిర్ణయాల్లో మళ్లీ పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్త వహించాలి. వాళ్ల విజయంలో భాగస్వామి అవ్వాలి.
- అన్నింటి కంటే ముఖ్యమైన విషయం లైఫ్ కోచ్ - క్లయింట్ల మధ్య ఒప్పందం.. అనుకోవడం కంటే.. ఒకరినొకరు నిజాయితీగా నమ్మటం పైనే ఆధారపడి ఉంటుంది. అదే సక్సెస్‌కి దారి చూపుతుంది.

## లైఫ్ కోచ్ అవడం ఎట్లా..

చదువు, ట్రైనింగ్, ఎక్స్‌పీరియన్స్.. లైఫ్ కోచ్‌కి ఉండాల్సిన మూడు ప్రధాన లక్షణాలు. లైఫ్ కోచింగ్‌లో కొన్ని సర్టిఫైడ్ కోర్సులు ఉంటాయి. ఏయే రంగంలో రాటుదేలాలనుకుంటే ఆ రంగానికి సంబంధించి స్పెషలిస్ట్స్ (నిష్ణాతులు) అయి ఉండాలి. వీళ్లలో కొందరు వర్క్‌షాపుల్ని నిర్వహించేందుకు శిక్షణ ఇస్తారు. ఇంకొందరు జనాల మధ్య ఎలా మాట్లాడాలో నేర్పిస్తారు. మరికొందరు వ్యాపారం ఎట్లా అభివృద్ధి చెందుతుందో సలహాలు ఇస్తారు. సక్సెస్‌ఫుల్ వ్యాపారవేత్తలు, అధికారులు, ఎంట్రప్రెన్యూర్‌లు, సీఈవోలు.. ఇలా ఎందరో లైఫ్ కోచ్‌ల ద్వారా వెలుగులోకి వచ్చినవాళ్లే. అయితే రిటైర్డ్ ఏజ్‌లో లైఫ్ కోచ్ గా ఉండేందుకు చాలా మంది ఆసక్తి చూపుతుంటారు. పైగా చట్టబద్ధత లాంటిది ఏం లేకపోవటంతో(మెడికల్ కౌన్సెలర్లకు తప్ప).. ఈ మధ్య కాలంలో 'లైఫ్ కోచింగ్' రంగంలోకి అడుగుపెడుతున్న వాళ్ల సంఖ్య ఎక్కువైంది.

## ఎట్ల జరుగుతదంటే..

లైఫ్ కోచింగ్‌లో కోచ్.. క్లయింట్‌తో ఇంటరాక్షన్ అయ్యేందుకు వేర్వేరు దారులున్నాయి. మొదటిది కాంప్లిమెంటరీ కోచింగ్ కన్సల్టేషన్.. ఫీజు తీసుకోకుండా క్లయింట్లతో కాసేపు సంభాషించడం. రెండోది 'డిజైన్ ది అలయన్స్'.. వారంలో అరగంట నుంచి గంటన్నర పాటు ఫోన్ కాల్‌లో మాట్లాడటం. ఇది సెషన్ బట్టి ఉంటుంది. ఇక మూడోది ఈ-మెయిల్ సపోర్ట్. దీనికి పరిమితి ఉండదు. అప్పుడప్పుడు ఫోన్ కాల్స్ ద్వారా కూడా ఇద్దరి మధ్య సంభాషణలు కొనసాగుతుంటాయి. 'లక్ష్యాల్ని నిర్దేశించడం, ప్లానింగ్, భయాల్ని పోగొట్టడం, ఒకవైపు పర్సనల్.. మరోవైపు ప్రొఫెషనల్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేయడం, వ్యాపారాన్ని అభివృద్ధి చేయడం, ఆదర్శవంతమైన జీవితం'.. ఇలా అన్నింటిలో లైఫ్ కోచ్‌ల పాత్ర ఉంటుంది. ఫైనల్‌గా.. క్లయింట్లలో సామర్థ్యాన్ని వెలికి తీయడమే లైఫ్ కోచ్‌ల పని.

